

తెలంగాణ భవన్‌లో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద

తెలంగాణ భవన్‌లో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తదితరులు

తెలంగాణ చరిత్ర.. కాళోజీ చరిత్రే!

- కొనియాడిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- కాళోజీ జయంతి వేడుకల్లో ఘన నివాళులు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చరిత్ర అంతా.. కాళోజీ నారాయణరావు చరిత్రే అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, గాదరి కిశోర్, పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, రూప్‌సింగ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మహిళా నాయకురాళ్లు తుల ఉమ, ముక్తవరం సుశీలారెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామి యాదవ్, పడాల సతీశ్ పాల్గొన్నారు.

ఢిల్లీలో కాళోజీకి ఘన నివాళి

ఢిల్లీలో తెలంగాణ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 110వ జయంత్యుత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ జ్యోతిప్రజ్వలన చేశారు.

చేనేత రుణాలు మాఫీ చేస్తం

- 290 కోట్ల బతుకమ్మల చీరల బకాయిల విడుదల
- మహిళా సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు చీరలు
- ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేసి కొండాలక్ష్మణ్ పేరు పెడతాం
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన.. ఫలించిన నేతన్నల పోరాటం

కాళోజీ నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): నేతన్నలు ఎనిమిది నెలలుగా చేస్తున్న పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. చేనేత రుణాలను మాఫీ చేయడంతోపాటు త్రిప్టు పథకం కింద రావాల్సిన రూ.290 కోట్ల బకాయిలను విడుదల చేసింది. రాష్ట్రంలో రూ. 30 కోట్ల చేనేత రుణాలు మాఫీ చేసి నేత కార్మికులను రుణవిముక్తులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని లలితా కళాతోరణంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో ఐఐహెచ్‌టీ లేకపోవడంతో మనరాష్ట్ర విద్యార్థులు ఏపీ, ఒడిశాకు వెళ్లాల్సివస్తున్నదని అన్నారు. ఈ అంశం తన దృష్టికి వచ్చిన వెంటనే ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కేంద్రం సైతం వెంటనే సానూకూలంగా స్పందించి ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసే స్కిల్ యూనివర్సిటీలో ఐఐహెచ్‌టీ భవనం ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న ఐఐహెచ్‌టీకి తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదిలేసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు పేడతామని ప్రకటించారు. నేత కార్మికుల కండ్లల్లో ఆనందం నింపేలక్ష్యంతో రూ. 290 కోట్ల బతుకమ్మ చీరల బకాయిలను విడుదల చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 63 లక్షల మంది మహిళా సంఘ సభ్యులకు ఏడాదికి రెండు చొప్పున నాణ్యమైన చీరెలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఏడాదికి కోటి 30 లక్షల చీరెల ఆర్డర్లను నేతకార్మికులకు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

నేతన్నల సుదీర్ఘ పోరాటం

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత పనిలేక, కుటుంబ పోషణ భారమై రాష్ట్రవ్యాప్తంగా 12 మంది నేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. తమను ఆదుకోవాలని ఆసాములు, కార్మికులు, యజమానులు ఒక్కటై జేఏసీగా ఏర్పడి సర్కారుపై పోరు ప్రారంభించారు. జూలై, ఆగస్టు నెలల్లో నిరసన దీక్షలు చేపట్టారు. ఎనిమిది నెలలుగా అలుపెరుగని పోరాటం చేయడంతో దిగొచ్చిన సర్కారు ఎట్టకేలకు నేతన్నల రుణాలు మాఫీ చేయడంతోపాటు, బకాయిలు విడుదల చేయడమే కాకుండా వారికి పని కల్పించడానికి కూడా ముందుకొచ్చింది.

తెలంగాణపై కేంద్రం కక్షపూరిత వైఖరి

- పన్నుల వాటాలో రాష్ట్రాలకు 31 శాతమే వస్తున్నాయి.. దానిని 50 శాతానికి పెంచాలి
- నాన్‌ట్యాక్స్ రెవెన్యూలోనూ వాటా ఇవ్వాలి
- 16వ ఆర్థిక సంఘంతో భేటీలో హరీశ్‌రావు
- బీఆర్ఎస్ తరపున వినతులు, సూచనలు, సలహాలు

ప్రజాభవన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణపై, పని చేసే రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత వైఖరి అవలంభిస్తున్నదని 16వ ఆర్థిక సంఘం ఎదుట మాజీ మంత్రి టీ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. పన్నుల వాటాలో కేంద్రం నుంచి రాష్ట్రాలకు 41% నిధులు రావాల్సి ఉండగా 31 శాతమే వస్తున్నాయని, మొత్తాన్ని 50 శాతానికి పెంచాలని కోరారు. కేంద్రప్రభుత్వ నాన్‌ట్యాక్స్ రెవెన్యూలో రాష్ట్రాలకు కూడా వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలకు ఇచ్చే గ్రాంట్‌ను 50 శాతానికి పెంచాలని, పెరిగిన జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఎత్తిపోతల నీటిపారుదల ప్రాజెక్టులు తప్పనిసరి పరిస్థితి అని, వాటి నిర్వహణకు రూ.50 వేల కోట్లు, మిషన్ భగీరథ నిర్వహణకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని కోరారు. వరదల సహాయ నిధిని ప్రస్తుతం ఉన్న 75:25 శాతం నిధులను గతంలో లాగా 90:10 శాతంగా మార్చాలని కోరారు. 16వ కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం సోమవారం ప్రజాభవన్‌లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైంది. ఈ భేటీకి బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద హాజరై, పార్టీ తరుపున పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీలు అమలు కాని విషయాన్ని హరీశ్‌రావు సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు 16వ ఆర్థిక సంఘానికి నివేదిక ఇచ్చామని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విధంగా సూచనలు చేశామని వివరించారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత అత్యధిక జీడీపీ వృద్ధితో దేశానికే ఆదర్శంగా నిలిపామని పేర్కొన్నారు. కేంద్రానికి వచ్చే ఆదాయంలో 20% సర్‌చార్జీలు, సెస్సుల రూపంలో సమకూర్చుకుంటున్నారని, ఈ డబ్బును వాటా ప్రకారం రాష్ట్రాలకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కేంద్రానికి వచ్చే నాన్‌ట్యాక్స్ రెవెన్యూ 2024-25లో రూ.5.46 లక్షల కోట్లకు పెరిగిందని, నాన్‌ట్యాక్స్ రెవెన్యూలో వాటా ఇవ్వాలని కోరామని వెల్లడించారు. తెలంగాణ దేశంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రమని, బాగున్నారు కాబట్టి వాటా తక్కువ ఇస్తామనడం అన్యాయమని పేర్కొన్నారు. 13వ ఆర్థిక సంఘంలో రాష్ట్రం వాటాగా 2.437% నిధులు ఇచ్చారని, 14వ ఆర్థిక సంఘంలో ఇది 2.133 శాతానికి, 15వ ఆర్థిక సంఘం నాటికి 2.102%కు తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుత 16వ ఆర్థిక సంఘంలో తెలంగాణకు అన్యాయం చేయవద్దని కోరామని తెలిపారు. పన్ను వసూళ్లలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాలకు ప్రస్తుతం ఇస్తున్న వెయిటేజీని 2.5% నుంచి 10 శాతానికి పెంచాలని కోరామని వివరించారు. స్థానిక సంస్థల గ్రాంట్‌ను 50 శాతానికి పెంచాలని, పట్టణ జనాభా పెరిగే రాష్ట్రాలకు నష్టం చేయొద్దని కోరినట్టు వెల్లడించారు.

ఎత్తిపోతలకు 40 వేల కోట్లు

ఎత్తులో ఉన్న తెలంగాణకు నీళ్లు రావాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం చేయాల్సి ఉంటుందని హరీశ్‌రావు వివరించారు. అందుకే కేసీఆర్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించారని, తద్వారా పెద్ద మొత్తంలో పంటలకు సాగునీరు ఇవ్వడం సాధ్యమైందని తెలిపారు. ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుల నిర్వహణకు కనీసం రూ.40 వేల కోట్లు కేటాయించాలని కోరినట్టు వెల్లడించారు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఇవ్వాలని కోరామని, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చి తెలంగాణకు ఇవ్వకుండా కేంద్రం అన్యాయం చేసిన వైనాన్ని వివరించామని తెలిపారు.

వరద సహాయ నిధిని 90:10కి మార్చాలి

ప్రభుత్వ దవాఖానల అభివృద్ధికి రూ.పదివేల కోట్లు కేటాయించాలని కోరామని హరీశ్‌రావు తెలిపారు. 14వ ఆర్థిక సంఘం వరకు రిపోర్ట్‌ను యథాతథంగా అమలు చేశారు కానీ, 15వ ఆర్థిక సంఘం నివేదికను కేంద్రం 'పిక్ అండ్ చూజ్'లాగా ఇష్టమున్నవి చేసి, ఇష్టం లేని వదిలిపెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. స్పెషల్ గ్రాంట్ కింద రూ.723 కోట్లు, సెక్టర్ స్పెసిఫిక్ కింద రూ.2,350 కోట్లు, స్టేట్ స్పెసిఫిక్ కింద రూ.3,024 కోట్లు మొత్తం రూ. 6,097 కోట్లు ఇవ్వాలని ఆర్థిక సంఘం చెప్పినా కేంద్రం పైసా ఇవ్వలేదని వివరించారు.

మొదటి రోజు కేంద్ర సంఘం సమావేశాలు

కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం సోమవారం ప్రజాభవన్‌లో పలు సంస్థలు రాజకీయ పార్టీలు, స్థానిక సంస్థలు, వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులతో విస్తృత స్థాయిలో సమావేశం అయ్యింది. చైర్మన్ డాక్టర్ అర్వింద్ పనగారియా, సభ్యులు అజయ్ నారాయణ్ ఝా, అన్నిజార్జ్ మాథ్యూ, డాక్టర్ మనోజ్ పాండా, సౌమ్య కాంతిఘోష్, సంఘం కార్యదర్శి రిత్విక్‌పాండే ఆధ్వర్యంలోని ఆర్థికసంఘం తొలుత మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాలిటీల చైర్మన్లతో సమావేశమైంది. అనంతరం మాజీ సర్పంచులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సంఘ సభ్యులతో సమావేశమైంది. వ్యాపార వాణిజ్య సంస్థలైన ఎలిప్, ఫిక్కీ, సీఐఐ ప్రతినిధులతో సమావేశం జరిగింది.

పన్నుల్లో వాటా పెంచండి: ఈటల

అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణను మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర పన్నుల్లో వాటా పెంచాలని 16వ ఫైనాన్స్ కమిషన్‌ను కోరినట్టు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సమావేశానికి బీజేపీ నేత ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఎస్ రాజయ్య, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎంఐఎం నుంచి శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మాజీ ఎమ్మెల్సీ సయ్యద్ అమీరుద్దీన్ జాఫ్రీ, ఎమ్మెల్యే బలాల, సీపీఐ నుంచి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం నుంచి మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి హాజరయ్యారు.

మిషన్ భగీరథకు 20 వేల కోట్లు

మిషన్ భగీరథ పథకానికి రూ.19,205 కోట్లు గ్రాంట్‌గా ఇవ్వాలని నీతి అయోగ్ సూచిస్తే కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పథకం నిర్వహణ కోసం రూ.2,350 కోట్లు ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం సూచిస్తే ఒక్క రూపాయి ఇవ్వలేదని వివరించారు. కేంద్రం ప్రారంభించిన హర్ ఘర్ జల్ కంటే ముందే తాము మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లు ఇవ్వడం పాపమైందా? అని హరీశ్ రావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అన్యాయాలను 16వ సంఘం చైర్మన్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు. మిషన్ భగీరథ నిర్వహణకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన కోరామని తెలిపారు.

వట్‌పల్లి ఎస్సై లక్ష్మణ్ సస్పెన్షన్

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్/వట్‌పల్లి, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి ఎస్సై లక్ష్మణ్‌పై సస్పెన్షన్ వేటుపడింది. మల్టీ జోన్-2 ఐజీపీ కార్యాలయంలో తక్షణమే రిపోర్ట్ చేయాల్సిందిగా ఐజీ వీ సత్యనారాయణ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడి పుట్టినరోజు వేడుకలు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించడంపై నివేదిక అందిన వెంటనే క్రమశిక్షణ చర్యలు చేపడతామని ఐజీ సత్యనారాయణ తెలిపారు. కాగా, ఎస్సైపై మాత్రమే చర్యలు తీసుకుంటే.. అన్నీతామై వ్యవహరించిన కిందిస్థాయి సిబ్బందిపై ఎలాంటి చర్యలు ఉంటాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన

- కాంగ్రెస్ పాలనలో 450 మంది రైతుల ఆత్మహత్య
- ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
- ఎంపీ లక్ష్మణ్ విమర్శ

హైదరాబాద్, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతున్నదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. 200కు పైగా హత్యలు, 1900కు పైగా లైంగిక దాడులు జరిగాయన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 450మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 15-20లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారని, బాధితులను ఎప్పు డు ఆదుకుంటారో చెప్పాలని డిమాం డ్ చేశారు. టీచర్ల కొరతతో 1800 స్కూళ్లు మూతపడ్డాయన్నారు. గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తున్నా కాంగ్రెస్ నేతలకు చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీ డిక్లరేషన్, కులగణన ఏమైందని ప్రశ్నించారు. రోజూ వార్తల్లో నిలిచేందుకు హైడ్రా పేరిట హడావుడి చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన వారు మరో పార్టీలోకి వెళ్లడం సిగ్గుచేటన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

- ములుగు జిల్లాలో 9 మందిపై దాడి
- నిజామాబాద్ జిల్లాలో 10 మందిపై పంజా

గాయపడిన సమ్మయ్య

గాయపడిన ఓ యువకుడు

గాయపడిన వృద్ధురాలు

మంగపేట/నందిపేట్/మాచారెడ్డి, సెప్టెంబర్ 9: ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని పొదుమూరులో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచింది. ఎర్రావుల సమ్మయ్య, కొప్పుల లాలయ్య, దాదాని, సైదా, మైతున్ బీ, ఘోరేతోపాటు మరో ముగ్గురిని కరించింది. వారికి తీవ్రంగా రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. పిచ్చికుక్క స్వైరవిహారంతో పలువురు భయాందోళనకు గురయ్యారు. అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలో కుక్కలు సోమవారం రెచ్చిపోయాయి. ఎక్కడికక్కడ దాడికి తెగబడ్డాయి. శునకాల దాడిలో పది మంది గాయపడ్డారు. బమ్మల లసుంబాయికి తీవ్ర గాయాలు కాగా.. ఆమెను జిల్లా దవాఖానకు తరలించినట్టు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా ఎక్స్ రోడ్ పరిధిలోనూ ఓ కుక్క దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన దాసరి మౌనిక, మ్యాడం అనసూయ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క వారిపై దాడి చేసి గాయపర్చింది.

కదలని ఫైళ్లు.. ఆగిన బిల్లులు

- కీలక నిర్ణయాలపై సర్కారు తాత్సారం
- జనవరి వరకు బిల్లులు నిలిపివేత
- అస్మదీయులకు మాత్రమే చెల్లింపులు
- 'ప్రాధాన్య' క్రమం అంటే అదేనా?

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఓవైపు రాష్ట్ర ఆదాయం పడిపోతుండటం.. మరోవైపు ఎన్ని అప్పులు తెచ్చినా ఇచ్చిన హామీలు నెరవేరే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో పాలన కుంటుపడుతున్నదని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. ఎన్నికల సమయంలోనే 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రకటనలు చేసింది. కానీ, వీటిలో కనీసం ఒక్క శాతం కూడా అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పినా.. ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి కింద ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపునకే రేవంత్‌సర్కారు పరిమితమైంది. వీటి అమలుకే నిధులు లేవని, మిగతావి అమలు చేయడం కష్టమని ఆర్థిక శాఖ వర్గాలు చేతులెత్తేసినట్టు తెలిసింది. ఆర్థికంగా భారమయ్యే నిర్ణయాలను మరో 4 నెలల వరకు అమలు చేయొద్దని ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చినట్టు వినికిడి. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఫైళ్లు ఆగిపోయినట్టు చెప్తున్నారు. మరోవైపు కాంట్రాక్టర్లకు జనవరి వరకు బిల్లులు నిలిపివేయాలని, 'ప్రాధాన్య' క్రమంలో మాత్రమే బిల్లులు చెల్లించాలని స్పష్టం చేసినట్టు తెలిసింది.

ప్రకటనల వరకే పరిమితం

ఈ ఏడాది జూలైలో రాష్ట్రానికి పన్నుల రూపేణా వచ్చే ఆదాయం రూ.9,965 కోట్లకు మించకపోవచ్చని రేవంత్‌రెడ్డి సర్కారు కాగ్‌కు నివేదించింది. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరంలోని తొలి 4 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.23 వేల కోట్ల అప్పులు చేసింది. ఓవైపు ఆదాయం తగ్గుతుండటం, మరోవైపు అప్పులు పెరుగుతుండటంతో వచ్చే 5 నెలల వరకూ ఏ కొత్త పథకాన్నీ నెత్తికెత్తుకోవద్దని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించినట్టు సమాచారం. అందుకే ఫైళ్లను పక్కన పడేసి, సబ్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. మూసీ సుందరీకరణ పేరుతో గత కొన్ని నెలలు చేసిన హడావుడి ఇప్పుడెందుకు లేదని జనం ప్రశ్నిస్తున్నారు. రైతు భరోసా పేరుతో అభిప్రాయ సేకరణ జరిపినా ఎటూ తేల్చలేదని, ఇందిరమ్మ ఇండ్లు ప్రకటనలకే పరిమితమయ్యాయని, రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్, తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ లోగో మార్పు.. ఇలా అనేక ఫైళ్లు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని మండిపడుతున్నారు. పింఛన్ల పెంపు ఊసేలేదని, మెట్రో ప్రతిపాదనలకు మోక్షం లేదని, ఉద్యోగులకు పెండింగ్ డీఏ అందని ద్రాక్షగా మారిందని మండిపడుతున్నారు. 'ఫిబ్రవరిలో క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నాం. కానీ, మీకు ఉద్యోగాలు ఇస్తే వెంటనే ప్రతి నెల జీతం ఇవ్వాల్సి వస్తుంది. కొన్నాళ్లపాటు ఆగండి' అని ఓ మంత్రి డీఎస్సీ-2008 అభ్యర్థులతో చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వం కనీసం 1,500 మందికి కూడా ఉద్యోగాలు ఇచ్చే స్థితిలో లేదని ఎద్దేవా చేస్తున్నారు.

అస్మదీయులకే బిల్లులు

కాంట్రాక్టర్లకు సంక్రాంతి వరకు బిల్లుల చెల్లింపులు నిలిపివేయాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. కానీ, వాటిని పూర్తిగా ఆపేయకుండా కాంగ్రెస్ వర్గీయులకు, ఇతర అస్మదీయులకు మాత్రమే బిల్లులు మంజూరు చేయాలని స్పష్టం చేసినట్టు సమాచారం. 'ప్రాధాన్యత' ప్రకారమే బిల్లులు మంజూరు చేస్తామని ఇటీవల ఓ మంత్రి బహిరంగంగానే చెప్పారు. రూ.లక్షల్లో ఉన్న బిల్లులకు ఉన్నతాధికారుల నుంచి, రూ.కోట్లలో ఉన్న బిల్లులకు మంత్రి స్థాయి నేతల నుంచి సిఫారసులు ఉంటే తప్ప చెల్లింపులు జరపొద్దని ఆ మంత్రి స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది. ఈ విషయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వ పెద్దలు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీకి కొత్త చీఫ్ నియామకం అంటూ నెలలపాటు ఢిల్లీ చుట్టూ తిరగడం, హైడ్రా పేరుతో రాష్ట్రాన్ని ఆగమాగం చేయడం లాంటివన్నీ డైవర్షన్ రాజకీయాల్లో భాగమేనన్న చర్చ జోరుగా సాగుతున్నది.

మంచిర్యాల కలెక్టర్‌కు డెంగ్యూ

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 9 : మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ డెంగ్యూ బారినపడ్డారు. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డెంగ్యూ పాజిటివ్ అని తేలింది. ప్లేట్‌లెట్స్ 32వేలకు పడిపోయినట్టు వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లినట్టు తెలిసింది. తెలంగాణ టూరిజం డైరెక్టర్ ఇలా త్రిపాఠిని మంచిర్యాల ఇన్‌చార్జి కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

డెంగ్యూతో పసికందు మృతి

హత్నూర, సెప్టెంబర్ 9: డెంగ్యూతో పసికందు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నది. హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన ప్రభులింగం, అనురాధ దంపతుల నెలన్నర రోజుల శిశువు వారం రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం దౌల్తాబాద్, సర్సాపూర్ ప్రైవేట్ దవాఖానలకు తీసుకువెళ్లినా జ్వరం తీవ్రత తగ్గలేదు. నాలుగు రోజుల క్రితం సంగారెడ్డిలోని శిశురక్ష దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు వైద్యపరీక్షలు జరిపి ప్లేట్‌లెట్స్ తగ్గడంతోపాటు డెంగ్యూ సోకినట్టు నిర్ధారించారు. అక్కడ అడ్మిట్ చేయించి చికిత్స చేయించినప్పటికీ పరిస్థితి విషమించడంతో వైద్యులు మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ తీసుకువెళ్లాలని సూచించారు. ఆదివారం నిలోఫర్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

విషజ్వరంతో మహిళ..

మంగపేట, సెప్టెంబర్ 9: ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం అంబేద్కర్ కాలనీకి చెందిన మహిళ సోమవారం విషజ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంకాయల సుజాత (30)కు ఇరవై రోజుల క్రితం విషజ్వరం సోకగా, స్థానికంగా వైద్యం చేయించారు. నయం కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది.

మౌలిక సదుపాయాలకు నిధులు పెంచాలి

16వ ఆర్థిక సంఘంతో పట్టణ ప్రాంత ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ): అభివృద్ధి కార్యక్రమాలపై విధిస్తున్న 18శాతం జీఎస్టీని ఎత్తివేయాలని పట్టణ స్థాని